సాక్షి నిజామాబాద్


గురువారం । 10 । ఏప్రిల్ । 2025



న్యాయం చేయడమే..

వినియోగదారులకు న్యాయం చేయడమే ధ్యేయం లక్ష్యమని సీజీఆర్‌ఎఫ్‌–2 టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ నారాయణ అన్నారు.

- 8లో ▸



నీటి విడుదల నిలిపివేత

యాసంగి పంటలకు కాలువలు, లిఫ్టుల ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న నీటిని నిలిపివేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.8 /21.9

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

వైద్యారోగ్య శాఖకు అంబులెన్స్ అందజేత



నిజామాబాద్‌అర్బన్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)గా అథాంగ్ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖకు రూ.30లక్షల విలువ చేసే అంబులెన్స్‌ను అందజేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు అంబులెన్స్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంబులెన్స్‌ను జిల్లా ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని, మరిన్ని కంపెనీలు ముందుకు వచ్చి సీఎస్ఆర్ కింద ప్రజలకి ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి మధు, ఐరాడ్ మేనేజర్ వర్ష, టోల్ గేట్ మేనేజర్ అనిల్, సిబ్బంది విరాజ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు మోసపోవద్దు



సుభాష్‌నగర్: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మార్కెటింగ్‌శాఖ గ్రేడ్–2 సెక్రటరీ శ్రీధర్ రైతులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీధర్ సూచించారు. మార్కెట్ యార్డులో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ కిషన్, సిబ్బంది శంకర్‌దాస్, హమాలీలు, దడువాయిలు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి



ధర్పల్లి(నిజామాబాద్‌రూరల్): శారీరక, మానసిక ఎదుగుదల కోసం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా శిశు సంక్షేమ అధికారిని రసూల్ బీ పేర్కొన్నారు. ధర్పల్లి మండల కేంద్రంతోపాటు దమ్మన్నపేట్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రసూల్ బీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లీబిడ్డల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం, మెడికల్ ఆఫీసర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్

మంగళవారం రాత్రి సిబ్బందికి సూచనలు చేస్తున్న నార్త్ సీఐ శ్రీనివాస్



అర్ధరాత్రి వేళ ఛబుత్రా(అరుగు)ల మీద కూర్చుని గప్పాలు కొట్టే.. బైక్‌లపై రయ్‌మని దూసుకెళ్లే ఆకతాయిల ఆగడాలకు 'ఆపరేషన్ ఛబుత్రా' చెక్ పెడుతోంది. జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి వేళ పోలీసులు గతకొద్ది రోజులుగా విస్తృతంగా తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. సరైన కారణం చూపకుండా రోడ్లపై కనిపించిన వారిని విచారిస్తూ స్టేషన్‌లకు తరలిస్తున్నారు. మరుసటి రోజున కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు జరిమానా విధిస్తున్నారు.



- ఆపరేషన్ ఛబుత్రా
- రెండేళ్ల తర్వాత జిల్లా కేంద్రంలో మళ్లీ ప్రారంభించిన పోలీసులు
- రాత్రి వేళల్లో గుంపులుగా తిరిగే వారిపై చర్యలు

ఖలీల్‌వాడి: అర్ధరాత్రి వేళ ఛబుత్రాల(అరుగు)పై కూర్చుని గప్పాలు కొట్టే, రోడ్లపై తిరిగి ఆకతాయిల ఆటకట్టించేందుకు పోలీసులు జిల్లా కేంద్రంలో 'ఆపరేషన్ ఛబుత్రా' నిర్వహిస్తున్నారు. నగరంలోని రోడ్లపై అర్ధరాత్రి వేళ తిరిగే వారికి చెక్ పెడుతున్నారు. ఇటీవల నాలుగు రోజుల్లో సుమారు వంద మందికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. గతంలో సీపీగా పని చేసిన కార్తికేయ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ నగరంతోపాటు ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో 'ఆపరేషన్ ఛబుత్రా' అమలు చేశారు. అప్పటి ఏసీపీ వెంకటేశ్వర్లు 'ఆపరేషన్ ఛబుత్రా'ను పక్కాగా అమలు చేశారు. ఆ తరువాత నాగరాజు, సత్యనారాయణ, కల్మేశ్వర్ సీపీలుగా పనిచేసిన కాలంలో నిర్వహించలేదు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనించిన సీపీ

కొత్తగా వచ్చిన సీపీ పోతరాజు సాయిచైతన్య ఇటీవల నగరంలో రాత్రివేళల్లో పెట్రోలింగ్ వెళ్లిన సందర్భంగా యువకులు బైక్‌లపై తిరగడం, ఛబుత్రాలపై కూర్చుని ముచ్చట్లు పెట్టడాన్ని గమనించారు. వెంటనే ఆపరేషన్ ఛబుత్రా అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో గత నాలుగు రోజులుగా నిజామాబాద్ నగరంలో ఆపరేషన్ ఛబుత్రా కొనసాగుతోంది. రాత్రివేళలలో బైక్‌లపై తిరిగే వారిని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు తరలించి వాహనాల పత్రాలను పరిశీలిస్తున్నారు. కుటుంబసభ్యుల సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తూ జరిమానా విధిస్తున్నారు. మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. అత్యవసరమైతేనే రాత్రి వేళ బయటికి రావాలని సూచిస్తున్నారు.



రాత్రివేళ రోడ్లపై తిరుగుతున్న యువకులను విచారిస్తున్న పోలీసులు (ఫైల్)

గొడవలకు చెక్ పెట్టేందుకు..

నగరంలోని పలు ప్రాంతాల్లో యువకుల మధ్య ఇటీవల గొడవలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. కొన్ని చోట్ల పరస్పరం దాడులు చేసుకోగా, మరికొన్ని చోట్ల కత్తులతో దాడులు చేసుకున్నారు. ఈ పరిస్థితికి ఆపరేషన్ ఛబుత్రాతో చెక్ పెట్టే అవకాశం ఉండడంతో సీపీ ఆదేశాల మేరకు పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆపరేషన్ ఛబుత్రా నిర్వహిస్తున్నారు.

కౌన్సెలింగ్.. జరిమానాలు

అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై తిరిగినా, ఛబుత్రాలపై కూర్చున్నా పోలీసులు స్థానిక స్టేషన్‌లకు తరలిస్తారు. ఆ తరువాత వాహనాల పత్రాలు, వ్యక్తిగత వివరాలను పరిశీలించి తరువాతి రోజు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తారు. జరిమానాలు విధిస్తారు. రెండోసారి పట్టుబడితే కేసులు తప్పవని స్పష్టం చేసి పంపిస్తారు.

శాంతినగర్‌లో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న శాంతినగర్‌లో మంగళవారం రాత్రి 12 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు ఆపరేషన్ ఛబుత్రా నిర్వహించారు. సరైన డాక్యుమెంట్లు లేని 25 ద్విచక్రవాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రిపుల్ రైడింగ్ కేసులో ఓ వాహనాన్ని సీజ్ చేశారు. రోడ్లపై, గ్రౌండ్‌లో తిరుగుతున్న 25 మంది యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. నార్త్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు గంగాధర్, రాజశేఖర్, లక్ష్మయ్య, 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

మంచిప్ప ప్రాజెక్టు పూర్తి చేయిస్తా



పడకల్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రెండేళ్లలో నియోజకవర్గం సస్యశ్యామలం
- ఏడు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- మొదటి విడతలో ప్లాట్లు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకోవాలి
- రెండో విడతలో స్థలం కేటాయించి ఇళ్లు నిర్మిస్తాం
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి: ప్రాణహిత చేవెళ్ల పథకంలో భాగంగా మంచిప్ప ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని పుప్పాలపల్లి, గన్యాతండా, మాదాపూర్, సికింద్రాపూర్, పడకల్, కలిగోట్, చింతలూర్ గ్రామాల్లో రూ.6 కోట్ల 74లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూపతిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి సాగునీరు అందివ్వలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ కలిసి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. రూరల్ నియోజక వర్గానికి 7వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటి విడతలో ప్లాట్లు ఉన్న లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. రెండో విడతలో అర్హులైన వారికి 75 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఎక్కడా లేని విధంగా రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, సుద్దులంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, జక్రాన్‌పల్లి మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువత రాజీవ్ యువవికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయారెడ్డి, మాజీ ఎంపీపీ అప్పాల రాజన్న, పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు ఉమ్మాజీ నరేశ్, చిన్న సాయారెడ్డి, వినోద్, పురుషోత్తంరెడ్డి, రాజేందర్, విఠల్, అరుణ్, రవిగౌడ్, గణేశ్, గంగారెడ్డి, నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీల కార్యకలాపాలను అణిచివేస్తాం

- గ్రామాల్లో పంచాయితీలు చేస్తే చర్యలు తప్పవు
- పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య హెచ్చరిక



ఖలీల్‌వాడి: గ్రామాల అభివృద్ధి అంశాలను పక్కనపెట్టి సివిల్ వివాదాలు, భూ తగదాలు తదితర పంచాయితీలు చేసే వీడీసీలను ఉక్కుపాదంతో అణిచివేస్తామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చట్టాన్ని వీడీసీలు తమ చేతుల్లోకి తీసుకుంటున్నాయని, బాధితులు పోలీస్‌స్టేషన్, న్యాయస్థానాన్ని ఆశ్రయించొద్దని, తాము చెప్పిన విధంగా వినాలని ఒత్తిడి చేయడం సరికాదని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పేరుతో బెల్ట్‌షాపులు, కోడిగుడ్లు, కూల్ డ్రింక్స్ తదితర అమ్మకాలకు వేలం నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్య వచ్చినా సంబంధిత శాఖలను సంప్రదించి ఆ శాఖ నుంచి సహాయసహకారాలు తీసుకోవాలని, తాము చెప్పేవి శాసనమని, చట్టామని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే తగు చర్యలు తీసుకుంటామని వీడీసీలను సీపీ హెచ్చరించారు. వీడీసీలు ఇబ్బందులకు గురి చేస్తే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

- ఉద్యోగార్థులకు ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన డిజిటల్ లైబ్రరీ విభాగాన్ని ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఇంటర్నెట్ సేవలతో కూడిన డిజిటల్ లైబ్రరీ కోసం ప్రత్యేకంగా రూ.5 లక్షలు సమకూర్చగా, పది కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీని నెలకొల్పారు. దీనిని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న జిల్లాకు చెందిన యువతతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు జిల్లా కేంద్ర గ్రంథాలయం సేవలను వినియోగించుకుంటున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేశామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు స్టడీ మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా సేకరించుకునేందుకు డిజిటల్ లైబ్రరీ ఉపయోగపడుతుందన్నారు. గ్రంథాలయంలో స్థలం సరిపోవడం లేదని, ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పాత డీఈఓ కార్యాలయంలోని గదులను రీడింగ్ రూమ్‌లుగా వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, తదితరులు చొరవ చూపి గత నెలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, అధికారులు, సిబ్బంది రాజారెడ్డి, నరేశ్‌రెడ్డి, తారకం, రాజేశ్వర్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనైతేనే వస్తాం!

- వేరే పనులకు ముందుకురాని ఉపాధి కూలీలు
- గతేడాదితో పోలిస్తే సగానికి తగ్గిన హాజరు
- చెరువుల్లో పూడికతీత పనులు లేకపోవడమే కారణం

డొంకేశ్వర్(ఆర్మూర్): వేసవి సీజన్ ప్రారంభమైనప్పటికీ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. చెరువుల్లో పూడికతీసే పనులు లేకపోవడంతో కూలీల హాజరు గణనీయంగా తగ్గిపోయింది. కొత్త పనులు చేసేందుకు కూలీలు అంతగా ఆసక్తి చూపకపోగా, చెరువు పనులైతేనే వస్తామంటున్నారు. దీంతో కూలీల హాజరును పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు తిప్పలు పడుతున్నారు. లక్ష్యానికి అనుగుణంగా పనిదినాలు పూర్తి చేయలేకపోతున్నారు. ఉపాధిహామీ పనుల్లో కొన్ని మార్పులు జరగడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పొచ్చు. గతేడాది వరకు చెరువుల్లో పూడికతీత, కెనాల్ పనులు ఉండేవి. చెరువుల్లో గుంతలు తవ్వే పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో వచ్చేవారు. వేసవిలో నాలుగు నెలలపాటు దండిగా ఉపాధి లభించేది. కేంద్ర ప్రభుత్వం కొత్త ఏడాది నుంచి చెరువుల్లో పూడికతీసే పనులను రద్దు చేసింది. కేవలం ఫిష్ పాండ్లు, అడవులు, గుట్టల్లో కందకాల తవ్వకం అలాగే వ్యవసాయ భూముల అభివృద్ధి, ఇతర పనులు చేయడానికి అనుమతి ఇచ్చింది. అలవాటు లేని, ఎక్కువ శ్రమతో కూడిన ఈ పనులను చేయడానికి కూలీలు పెద్దగా ముందుకు రావడం లేదు.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

మండలాలు	27
గ్రామ పంచాయతీలు	530
జాబ్ కార్డులు	2.56 లక్షలు
కూలీలు	4.86 లక్షలు

పోయిన ఏడాది ఇదే సమయానికి జిల్లా వ్యాప్తంగా రోజుకు 50వేల మందికి పైగా కూలీలు పనులకు రాగా, ఇప్పుడు 25వేలు కూడా దాటడం లేదు. ఒక్కోసారి కొన్ని గ్రామాల్లో పదిమందికి మించి రావట్లేదు. అదే విధంగా నూతన ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 29.60 లక్షల పనిదినాలు మాత్రమే ప్రభుత్వం అనుమతినిచ్చింది. గతేడాది 50లక్షల పనిదినాలకు అవకాశం ఇచ్చింది. పనిదినాలు కూడా కోతకు గురయ్యాయి.




గుట్టల్లో కందకాలు తవ్వుతున్న ఉపాధికూలీలు

బుధవారం మండలాల వారీగా హాజరైన కూలీలు

మండలం	హాజరైన కూలీలు	మండలం	హాజరైన కూలీలు	మండలం	హాజరైన కూలీలు
ఆర్మూర్	1475	నవీపేట్	1649	రుద్రూర్	310
మోర్తాడ్	724	కమ్మర్‌పల్లి	713	డిచ్‌పల్లి	1020
మాక్లూర్	2006	రెంజల్	850	నిజామాబాద్	567
భీమ్‌గల్	1787	ధర్పల్లి	1034	మెండోరా	308
ఇందల్వాయి	1310	వేల్పూర్	846	మోపాల్	525
జక్రాన్‌పల్లి	1173	సిరికొండ	1212	కోటగిరి	536
బాల్కొండ	554	మోస్రా	189	చందూర్	84
నందిపేట్	1815	వర్ని	809	బోధన్	384
ఏర్గట్ల	432	ముప్కాల్	249	మొత్తం	23164
		ఎడపల్లి	603		

మోర్తాడ్ ముందుంది

- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించిన గ్రామంగా వంద మార్కులు
- జిల్లా స్థాయిలో ప్రథమ.. రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం
- అవార్డు అందించనున్న కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ



మోర్తాడ్ గ్రామం

మోర్తాడ్: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నిర్దేశించిన ప్రకారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించిన గ్రామంగా మోర్తాడ్ జిల్లాస్థాయిలో వందమార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే రాష్ట్ర స్థాయిలో 81.29 మార్కులతో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. 2022–23లో కేంద్ర ప్రభుత్వం పలు అంశాల్లో గ్రామాల అభివృద్ధిపై నివేదికను కోరింది. ప్రతి పంచాయతీతో సెల్ఫ్ అప్రైజల్ రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఇందులో భాగంగానే మోర్తాడ్ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నిర్దేశించిన ప్రకారం అన్ని రంగాల్లో మంచి ఫలితాలను సాధించడంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటింది. మౌలిక వసతులు, ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన, చిన్నారులు, మహిళలకు సౌకర్యాలు, పారిశుధ్యం, పచ్చదనం, సామాజిక భద్రత ఇలా అనేక అంశాలపై గ్రామంలోని వాస్తవ పరిస్థితులను అద్దం పట్టేలా రిపోర్టును తయారు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లా స్థాయిలో రిపోర్టులను పరిశీలించి రాష్ట్రస్థాయికి పంపించగా అక్కడ పరిశీలన అనంతరం కేంద్రానికి పంపించారు. రాష్ట్ర స్థాయిలో 25 గ్రామ పంచాయతీలకు చోటు దక్కగా అందులో మోర్తాడ్‌కు నాలుగో స్థానం లభించడం గమనార్హం. మోర్తాడ్ జిల్లా స్థాయిలో వంద మార్కులను సాధించింది. రాష్ట్ర స్థాయిలో మాత్రం 81.29 మార్కులను పొందింది.

త్వరలో అవార్డులు

మోర్తాడ్‌కు రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం దక్కడంతో ప్రత్యేకాధికారికి, కార్యదర్శికి, ఎంపీడీవోకు అవార్డులను అందించే అవకాశం ఉంది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అవార్డులను త్వరలోనే అందించే అవకాశం ఉందని పంచాయతీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మోర్తాడ్‌కు అవార్డు దక్కగా అప్పట్లో సర్పంచ్‌లు ఉన్నారు. మాజీ ప్రజాప్రతినిధులకు కాకుండా అధికారులకే అవార్డులను అందించాలని కేంద్రం నిర్ణయించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మా శ్రమకు గుర్తింపు లభించింది



జిల్లా స్థాయిలో మోర్తాడ్ వంద మార్కులు, రాష్ట్ర స్థాయిలో 81.29 మార్కులతో నాలుగో స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. మా శ్రమకు గుర్తింపు లభించింది. గ్రామంలో సుపరిపాలన ఇతర అంశాల విషయంలో ప్రజలు, అధికారుల సహకారంతో ముందుకు సాగాం. అవార్డు లభించినందుకు సంతృప్తిగా ఉంది. – భోగ ధరణి, మాజీ సర్పంచ్, మోర్తాడ్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- డీపీవో శ్రీనివాస్‌రావు
- నడిపల్లి పంచాయతీ తనిఖీ



నడిపల్లి శివారులోని కల్వర్టు వద్ద విచారణ జరుపుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు

డిచ్‌పల్లి: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు సిబ్బందిని ఆదేశించారు. డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం డీపీవోను ఇన్‌చార్జి ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి రాధిక, జూనియర్ అసిస్టెంట్ రజత్‌కుమార్, సిబ్బంది సన్మానించారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ..

డిచ్‌పల్లి మండలం నడిపల్లి గ్రామశివారులో పెట్రోల్ బంక్ సమీపంలో తన పట్టా భూమిలోకి కల్వర్టు నుంచి నీళ్లు వస్తున్నాయని నిజామాబాద్‌కు చెందిన ఉప్పల అంజయ్య ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఈ విషయమై డీపీవో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడి భూమిని పరిశీలించిన అనంతరం నీటి పారుదల, రెవెన్యూ శాఖలకు చెందిన సమస్య కావడంతో సంబంధిత అధికారులకు లేఖ రాసి సమస్య పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. బాధితుడి భూమిలో తాత్కాలికంగా నీళ్లు నిలువకుండా చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను డీపీవో ఆదేశించారు.

క్లుప్తంగా

రాజకీయ ప్రతినిధులతో సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ: నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం కమిషనర్ దిలీప్ కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీ, జాబితాలో తప్పుల సవరణలు వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, పార్టీల నాయకులు షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ గౌడ్

నిజామాబాద్ రూరల్: వీర హనుమాన్ జయంతి శోభాయాత్ర కోసం తయారు చేసిన ప్రచార రథాలను నగరంలోని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూ వాహిని రాష్ట్ర టోలి సభ్యులు ప్రసాద్ జీ, ఏబీవీపీ రాజీ సాగర్ జీ, నవీన్, ఆర్య సమాజ్ రాజేశ్వర్, ఇందూర్ విభాగ్ ప్రముఖ్ తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్ , కార్యదర్శి గాజుల దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

డిచ్‌పల్లి: బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకుడు జెట్లింగ్ ఎల్లోసా సూచించారు. సుద్దపల్లి గ్రామంలో తెయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1, యూనిట్-4ల సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవికాల ప్రత్యేక శిబిరంలో బుధవారం ఆన్‌లైన్ బెట్టింగ్‌తో నష్టాలపై ఆయన అవగాహన కల్పించారు. తెలంగాణ గేమింగ్ నిరోధక చట్టం 1974పై వివరించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి హెడ్‌కానిస్టేబుల్ ఏవీ రమణ సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు స్వప్న, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి కవిత, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదల నిలిపివేత

- కాకతీయ కాలువ ద్వారా కొనసాగింపు
- ఎస్సారెస్పీ లక్ష్మి, సరస్వతి కాలువలతోపాటు లిఫ్టులకు బ్రేక్



శ్రీరాంసాగర్ జలాశయం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్ కోసం కాలువలు, లిఫ్టుల ద్వారా విడుదలవుతున్న నీటిని ప్రాజెక్ట్ అధికారులు బుధవారం నిలిపివేశారు. డిసెంబర్ 25 నుంచి ఆయకట్టుకు ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. వారబంధీ ప్రకారం కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టారు. యాసంగికి 63.5టీఎంసీల నీటిని కేటాయించగా, ఇప్పటి వరకు 68 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. నీటి విడుదల సమయంలో ప్రాజెక్ట్‌లో 80.5 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం 12.5 టీఎంసీల నీరుంది.

కాకతీయకు కొనసాగింపు..

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను మరో మూడు రోజులు కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో కాలువ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు జోన్-2 ఆయకట్టుకు ప్రవహిస్తోంది. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. కాగా, ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1062.00(12.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 9.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడు



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్

తెయూ(డిచ్‌పల్లి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. అంబేడ్కర్ రీసెర్చ్ అండ్ స్టడీ సెంటర్, తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'అంబేడ్కర్ జీవితం – నేటి యువతకు ఆదర్శం' అనే అంశంపై బుధవారం క్యాంపస్ కళాశాల సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ.. బాల్యం నుంచి ఉద్యోగం చేసే వరకు కుల వివక్షను ఎదుర్కొన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వాటిని నిర్మూలించడానికి చివరి వరకు పోరాటం చేశారని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఇబ్బంది రావొద్దని భావించి, దేశ పౌరులందరికీ ఒకే రాజ్యాంగం ఉండాలని రాజ్యాంగ రూపకల్పన చేశారని పేర్కొన్నారు. అంబేడ్కర్ హిందూమతానికి వ్యతిరేకం కాదని, కేవలం హిందూమతంలో ఉన్న సామాజిక వివక్షపై విసుగుచెంది సమరసతను బోధించే బౌద్ధ మతాన్ని స్వీకరించి గౌతమబుద్ధుని మార్గంలో నడిచారని తెలిపారు. కానీ కొందరు అంబేడ్కర్‌ను ఒక కులానికే పరిమితం చేసే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. విద్యార్థులందరూ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజంలో నెలకొన్న సమస్యలపై బాధ్యతాయుతంగా పోరాడాలని తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, కమిటీ అధ్యక్షుడు పృథ్వీ, నరేందర్, అశోక్, మనోజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు కేసులో ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేశ్

బాన్సువాడ: నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి, అంకోల్ గ్రామాల్లో కల్తీ కల్లు కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లులో ఆల్ప్రాజోలం అనే మత్తు పదార్థం కలపడం వల్ల 69 మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఈ కల్లు విక్రయించిన కేసులో దుర్కి గ్రామానికి చెందిన లక్ష్మాగౌడ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించామన్నారు. నిందితుడిని జుడీషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. ఆయన వెంట ఎస్సై లావణ్య, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, హరిచంద్ పాల్గొన్నారు.

న్యాయం చేయడమే ఫోరం లక్ష్యం

- సీజీఆర్‌ఎఫ్ -2 చైర్మన్ ఎరుకల నారాయణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): విద్యుత్ వినియోగదారులకు న్యాయం చేయడమే ఫోరం లక్ష్యమని, సమస్య పరిష్కారానికి ఫోరం కట్టుబడి ఉందని సీజీఆర్‌ఎఫ్-2 టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ ఎరుకల నారాయణ పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలం బర్దీపూర్ సబ్ స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతులు, వ్యాపారులు, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. సీజీఆర్‌ఎఫ్-2 పరిధిలో 8 జిల్లాలు ఉన్నాయని, ప్రతి నెలా ఒక సబ్‌డివిజన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సేవలకు సంబంధించిన ఎనిమిది రకాల సమస్యల పరిష్కారం కోసం ఫోరం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. ప్రతి డివిజన్, సబ్‌డివిజన్, సబ్‌స్టేషన్, సెక్షన్ కార్యాయాల్లో సిటిజన్ చార్ట్ ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. కొందరు ఏఈలు, సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ -2 సభ్యులు లకావత్ కిషన్, మర్రిపల్లి రాజాగౌడ్, డీఈ రమేశ్, ఏఈడీ బాలేశ్, ఏఈలు శ్రీనివాస్, ప్రవీణ్, శంకర్, నాగ శర్వాణి, భాస్కర్, రాజేందర్, సబ్ ఇంజనీర్లు, ఎస్‌ఎల్‌ఐ నాంపల్లి, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, ఏఎల్‌ఎంలు, జేఎల్‌ఎంలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ -2 చైర్మన్ ఎరుకల నారాయణ

మాక్లూర్ సొసైటీలో మళ్లీ తప్పులు

- మరో అక్రమానికి పాల్పడుతూ దొరికిన మాజీ చైర్మన్ కుమారుడు

మాక్లూర్: అవినీతి ఆరోపణల నేపథ్యంలో చైర్మన్ కుర్చీ నుంచి రైతులచే తొలిగించబడిన మాక్లూర్ సొసైటీ మాజీ చైర్మన్ గోపు లక్ష్మి కుమారుడు గోపు రంజిత్ మరోసారి సొసైటీని తప్పుదోవపట్టించే క్రమంలో బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. సొసైటీకి తెలియకుండానే స్వతహాగా 3,000 ఖాళీ బస్తాలు తెప్పించుకొని అందులో 750 బస్తాలు కొనుగోలు కేంద్రంతో సంబంధం లేకుండా కాంటా చేసి సొసైటీ ట్రక్ షీట్‌తో ఒక లోడును రైస్‌మిల్లుకు పంపించాడు. మరో 750 బస్తాల లోడును పంపించే క్రమంలో రైతులు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వాస్తవానికి ఖాళీ బార్దన్ (40 కిలోల ఖాళీ సంచులు) సొసైటీ నుంచి సంబంధిత కొనుగోలు కేంద్రానికి చేరాల్సి ఉంటుంది. అంతేకాకుండా కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నుంచి సంబంధిత లారీ డ్రైవర్‌తో ట్రక్‌షీట్ వెళ్లాల్సి ఉంటుంది. కానీ గుంజ్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ గోపు లక్ష్మి కుమారుడు గోపు రంజిత్ చిక్లి కొనుగోలు కేంద్రం నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఈ తతంగం నడిపి దొరికిపోయాడు. ఇదిలా ఉండగా ప్రస్తుత చైర్మన్ బూరోల్ల అశోక్‌కు తెలియకుండా ఖాళీ బార్దన్ నేరుగా రైస్‌మిల్లు నుంచి రంజిత్ వద్దకు చేరే అవకాశమే లేదని అనుభవజ్ఞులు చెబుతున్నారు. ట్రక్ షీట్ చైర్మన్‌కు తెలియకుండా అక్కడి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నుంచి ఎలా వెళుతుందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికార పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. పూర్తి విచారణ చేయిస్తున్నట్లు సమాచారం. రంజిత్ దొడ్డిదారిన, నేరుగా రైస్‌మిల్లుకు ధాన్యం పంపించడంతో త్వరగా డబ్బులు చేతికి వచ్చే అవకాశం ఉందని, ఎవరికి వారే పైరవీలతో ధాన్యం రైస్‌మిల్లులకు తరలించుకుంటే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

> **పాత పరిచయంతో తెప్పించుకొని ఉంటాడు..**
>
> పాత పరిచయాలతోనే గోపు రంజిత్ రైస్‌మిల్లర్ నుంచి ఖాళీ బార్దన్ తెచ్చుకొని ఉంటాడు. ఈ విషయం రైతుల ద్వారానే నాకు తెలిసింది. చిక్లి కొనుగోలు కేంద్రంలో గోపు రంజిత్ దగ్గరి బంధువు ఇన్‌చార్జిగా ఉండడంతో ఆయన చేసిన అక్రమం త్వరగా బయటపడలేదు. అతన్ని వెంటనే తొలగించి మరో వ్యక్తిని నియమించాం. గోపు రంజిత్‌పై చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా.
>
> – బూరోల్ల అశోక్, సొసైటీ చైర్మన్

బాలుడి అదృశ్యం.. అరగంటలో గుర్తించిన పోలీసులు



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి బస్టాండ్‌లో నాలుగేళ్ల బాలుడు తప్పిపోగా పోలీసులు అరగంటలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం పోతారం గ్రామానికి చెందిన వల్లపు నర్సవ్వ తన నాలుగేళ్ల మనువడు ఈశ్వర్‌ను వెంట తీసుకొని బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కొత్త బస్టాండ్‌కు చేరుకుంది. జ్యూస్ కొనుక్కొని వస్తానని బస్టాండ్‌లో మనువడిని కూర్చోబెట్టి పక్కనే ఉన్న స్టాల్‌కు వెళ్లింది. 5 నిమిషాల తర్వాత వచ్చి చూడగా బాలుడు కనిపించలేదు. ఆందోళనకు గురైన నర్సవ్వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే ప్రాంతంలో విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ శిరీష, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి బాలుడి ఆచూకీ కోసం గాలించారు. అరగంట తర్వాత అశోక్‌నగర్ చౌరస్తా వద్ద బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి బాలుడిని తండ్రి అలకుంట ఎల్లయ్య, అమ్మమ్మ నర్సవ్వకు అప్పగించారు. పోలీసు సిబ్బందిని పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని సిద్దులగుట్ట వెనుకాల ఓ హోటల్ పక్కన ఖాళీ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణగౌడ్ తెలిపారు. మృతుడికి సుమారు 15– 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఒంటిపై ఎరుపు రంగు టీషర్టు, బ్లూకలర్ జీన్స్ ప్యాంటు ఉందని పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా.. యువతి మృతి

పలువురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు



అంజలి పూజ(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కారు బోల్తా పడి చిన్నగుట్ట తండాకు చెందిన పీజీ విద్యార్థిని బాదావత్ అంజలి పూజ(22) మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం తండాకు చెందిన కేతావత్ మౌనిక, కేతావత్ శిల్ప, కేతావత్ రష్మిక, కేతావత్ శివకృష్ణతోపాటు చిన్నగుట్ట తండాకు చెందిన అంజలి పూజ షాపింగ్ కోసం మంగళవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో గాంధారి సమీపానికి చేరుకున్నారు. గాంధారి-కామారెడ్డి రహదారిపై మాధవ్‌పల్లి-గాంధారి మధ్యలో ఏదో అడవి జంతువు అడ్డం రావడంతో కారు నడుపుతున్న శివకృష్ణ జంతువును తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న అందరికీ గాయాలయ్యాయి. అంజలి పూజకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఉదయం 8.30 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు. మిగతా క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. మృతురాలి తండ్రి బాదావత్ వసంత్ రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణగౌడ్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో బుధవారం ఉదయం చికిత్స పొందుతున్న తరుణంలో గుండెపోటుతో మరణించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు, నలుపు రంగు టీషర్టు ఉందని, మృతుని ఆచూకీ తెలిసినవారు ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మద్యం తాగొద్దంటే కత్తితో పొడుచుకున్నాడు



షేక్ రఫత్ (ఫైల్)

ఖలీల్‌వాడి: నిత్యం మద్యం తాగివస్తే కుటుంబ పోషణ ఎలా గడుస్తుందని భార్య అడగడంతో భర్త కత్తితో పొడుచుకున్న ఘటన నగరంలో చోటుచేసుకుంది. రెండో టౌన్ ఎస్సై యాసీన్ ఆరాఫత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అహ్మద్‌పుర కాలనీకి చెందిన షేక్ రఫత్ (43), రేష్మాబేగం దంపతులు. రఫత్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. నిత్యం మద్యం సేవిస్తే ఆటో ఫైనాన్స్, పిల్లల చదువుతోపాటు కుటుంబం ఎలా గడుస్తుందని రఫత్‌ను మంగళవారం భార్య ప్రశ్నించింది. దీంతో ఇంట్లో ఉన్న మామిడికాయలు కోసే కత్తితో రఫత్ పొడుచుకున్నాడు. గమనించిన భార్య జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ రఫత్ బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంటరి జీవితంపై విరక్తితో మహిళ..



మల్లవ్వ (ఫైల్)

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి మల్లవ్వ (52) మంగళవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లవ్వ భర్త ఎల్లయ్య 2001 నుంచి కనిపించడం లేదు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూతురికి పెళ్లి చేయగా కుమారుడు నరేశ్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి మల్లవ్వ ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. కుటుంబీకులు దగ్గర లేకపోవడంతో ఒంటరి జీవితంపై విరక్తి చెంది మంగళవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని బుధవారం చెరువులో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్రవంతి వివరించారు.

కుటుంబ కలహాలతో ఒకరు..



రాజన్న (ఫైల్)

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన తూర్పు రాజన్న (48) కుటుంబ కలహాలతో మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. రాజన్న నెల రోజుల క్రితమే గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరు వ్యక్తులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. నందిపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను ఇన్‌స్టాగామ్‌లో పరిచయం చేసుకున్న సాలూర మండల కేంద్రానికి చెందిన మైత్రి రాజ్‌కుమార్ పెళ్లి చేసుకుంటానని చెప్పి కిడ్నాప్ చేసి బోధన్ మండలంలోని సాలంపాడు గ్రామంలో స్నేహితుడి ఇంటి వద్ద దాచి పెట్టాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు.. బాలికను కిడ్నాప్ చేసిన మైత్రి రాజ్ కుమార్‌తోపాటు సాలంపాడుకు చెందిన దంతం రాజును అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన బైక్, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

మోపాల్‌లో ఒకరిపై..

మోపాల్: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి అదే గ్రామంలోని మైనర్‌పై కొంతకాలంగా లైంగికదాడికి పాల్పడుతున్నాడు. బాలిక నాలుగు నెలల గర్భిణి కావడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి క్యాంపులో బుధవారం విద్యుత్ షాక్ తగిలి కృష్ణార్జున్‌కు చెందిన గేదె మృతి చెందింది. గేదె మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుష్ రాడ్‌ను తాకడంతో షాక్ తగిలింది. మృతి చెందిన గేదె విలువ రూ. లక్షా 20వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: భర్తను గొంతు నులిమి హత్య చేసిన భార్యకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ మూడో అదనపు సెషన్స్ జడ్జి ఆశాలత బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్ మండలం జన్నేపల్లి గ్రామానికి చెందిన ముక్కల సాయిలు, రేఖ భార్యాభర్తలు. వీరికి కూమార్తె, కుమారుడు ఉన్నారు. భార్యపై అనుమానంతో సాయిలు రోజు మద్యం తాగివచ్చి శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో భర్తను కడతేర్చాలని రేఖ నిర్ణయించుకుంది. 2024 ఏప్రిల్ 11న రాత్రి 11గంటలకు మద్యం మత్తులో నిద్రిస్తున్న భర్తను రెండు చేతులతో గొంతు నులిమి హత్యచేసింది. అనంతరం చీరతో ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరించింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు రేఖ తన భర్తను హత్య చేసినట్లు నిర్ధారిస్తూ జీవిత కారాగార శిక్షతోపాటు సాక్ష్యాలను తారుమారు చేసినందున సెక్షన్ 201 ప్రకారం ఏడేళ్ల కఠిన జైలుశిక్ష విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని జడ్జి ఆశాలత తీర్పులో పేర్కొన్నారు.

హత్య కేసులో మరొకరికి..

ఖలీల్‌వాడి: వ్యక్తిని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు సెషన్స్ జడ్జి తూముకుంట శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీకి చెందిన జలీల్‌ఖాన్ రోజూ ఓ మహిళను బహిరంగ ప్రదేశంలో బూతులు తిట్టేవాడు. దీంతో రోడ్డు పక్కనే రొట్టెలు చేసే తన పెద్దమ్మ కమలాబాయి, మరో మహిళ కాశక్క ఇబ్బంది పడుతున్నారని అదే కాలనీకి చెందిన తంగల్వాడి నర్సింగ్ అలియాస్ సోను.. జలీల్‌ఖాన్‌ను బెదిరించేవాడు. అయినా మార్పు రాకపోవడంతో విసిగివేసారిన నర్సింగ్.. 2024 ఫిబ్రవరి 14న రాత్రి 8:30 గంటలకు జమీల్‌ఖాన్ యథావిధిగా బూతుమాటలు మాట్లాడడం చూసి తట్టుకోలేదు. వెదురు కర్రతో తల, ముఖంపై బలంగా కొట్టడడంతో జలీల్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు నేర న్యాయ విచారణలో నిరూపితమైనట్లు జడ్జి శ్రీనివాస్ ప్రకటించాడు. హత్యానేరానికి గాను నర్సింగ్‌కు జీవిత కారాగార శిక్షను ఖరారు చేశారు. నిజామాబాద్ రూరల్ పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ వాదనలు వినిపించారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి ఏడాది..

ఖలీల్‌వాడి: మోపాల్ పీఎస్ పరిధిలో ఎస్సై విధులకు ఆటంకపరిచిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జడ్జి శ్రీనివాస్ రావు తీర్పు వెలువరించినట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోపాల్‌లో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఎస్సై సతీశ్ చర్యలు తీసుకునే క్రమంలో మాక్లూర్ మండలం గుత్పకు చెందిన రెంజర్ల శ్రీనివాస్, రెంజర్ల మండల కేంద్రానికి చెందిన రంగన్నగారి నర్సారెడ్డి మద్యం మత్తులో ఎస్సైపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. వారికి ఏడాది జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధించినట్లు చెప్పారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజులు..

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాన్ని నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించినట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు. నాందేడ్ జిల్లా దెగ్లూర్‌కు చెందిన ఎండీ ఇలియాస్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడని తెలిపారు. బోధన్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శేషతల్ప సాయి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

తమ్ముడిని చంపిన అన్నకు..

కామారెడ్డి క్రైం: ఆస్తి కోసం సొంత తమ్ముడిని దారుణంగా హత్య చేసిన నిందితుడికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లంకు చెందిన సబేరా బేగంకు స్థానికంగా వెయ్యి గజాల ప్లాటు ఉంది. తనకు రావాల్సిన వాటా పంచి ఇవ్వాలని ఆమె పెద్ద కొడుకు మహమ్మద్ షాదుల్ తరచుగా గొడవ పడేవాడు. గొడవలు వద్దంటూ చిన్న కొడుకు మహమ్మద్ ముజీబ్ సర్ది చెప్పేవాడు. దీంతో ముజీబ్‌పై షాదుల్ కక్ష పెంచుకున్నాడు. 2021 మే 14న రంజాన్ కావడంతో కుటుంబం అంతా ఒకే చోట ఉన్న సమయంలో షాదుల్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ముజీబ్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ముజీబ్‌ను కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడు. కేసు నమోదు చేసిన పిట్లం పోలీసులు షాదుల్‌ను రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ నేరం రుజువు కావడంతో నిందితుడు షాదుల్‌కు జీవిత ఖైదు రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి బాన్సువాడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై రంజిత్, ప్రస్తుత బాన్సువాడ సీఐ రాజేశ్, ఎస్సై రాజు, పోలీసుల తరఫున వాదనలు వినిపించిన పీపీలు దామోదర్ రెడ్డి, సూర్య ప్రసాద్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, సిబ్బంది కిషన్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బిల్ కలెక్టర్‌కు తీవ్రగాయాలు

ఆర్మూర్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ బిల్ కలెక్టర్ వెంకటేశ్వర్ రావుకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రి ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో విధులు ముగించుకొని జూనియర్ అసిస్టెంట్ రాజయ్యతో కలిసి వెంకటేశ్వర్ రావు నిజామాబాద్‌లోని తన ఇంటికి వెళుతున్నాడు. మాక్లూర్ మండలం చిన్నాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై వరి ధాన్యం ఆరబెట్టడంతో వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో తీవ్రగాయాలైన వెంకటేశ్వర్‌రావును జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఇన్‌ఫెక్షన్ కావడంతో కాలును తొలగించారు.

షాపు యజమానులకు జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వ్యాపార సమయం దాటిన తర్వాత దుకాణాలను తెరిచి ఉంచిన ఇద్దరు వ్యాపారులకు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి బుధవారం తెలిపారు. మంగళవారం నిర్దేశిత సమయానికి మించి వ్యాపార కార్యకలాపాలు కొనసాగించిన యజమానులు షేక్ గౌస్ పాషా (షా గౌస్ హోటల్), అన్సార్ హుస్సేన్(ఖురేషి హోటల్)ను బుధవారం జిల్లా స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. కోర్టు ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష విధించగా, జిల్లా జైలుకు తరలించామని తెలిపారు.